క్లుప్తంగా

15న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన వారికి ఈనెల 15వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జియాలజీ, జువాలజీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక నియమావళి మేరకు నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పనిగంటల ఆధారంగా వేతనం చెల్లిస్తామన్నారు.

బ్యాగులు పంపిణీ



స్కూలు బ్యాగులు అందుకున్న చిన్నారులతో దాతలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : నగరంలోని బాసట చిల్డ్రన్స్ హోంలో చిన్నారులకు స్కూలు బ్యాగులు, గ్రీజర్‌ను అందజేసినట్లు స్నేహం ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసన్న, పద్మ తెలిపారు. గురువారం స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవిందరాజులు, సుధారాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటరమణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

బీకాం కోర్సును కొనసాగించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పేద మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం బీకాం జనరల్ చదవడానికి శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం జనరల్ కోర్స్ తొలగిస్తున్నట్లు ప్రకటిస్తూ ప్రైవేటు కళాశాలలో బీకాం జనరల్ కోర్సు కొనసాగిస్తున్నట్లు తెలపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్ఎస్ఎఫ్ నాయకులు నవీన్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకం లాభదాయకం



శిక్షణ పొందిన మహిళా రైతుకు సర్టిఫికెట్ అందజేస్తున్న కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: రైతులు వ్యవసాయంతో పాటు పుట్టగొడుగుల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని మంచి లాభాలు గడించాలని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. కేవీకేలో పుట్టగొడుగుల పెంపకంపై రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో కూడా ముత్యపు పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం బాగుంటుందన్నారు. శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ పుట్టగొడుగులు మంచి పౌష్టికాహారం అన్నారు. కార్యక్రమ అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, మహేషబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు

కడప కల్చరల్ : నిరుపేద అర్చక కుటుంబానికి కడప నగరానికి చెందిన జిల్లా బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం ఐక్యవేదిక ఆర్థికసాయం అందించింది. పులివెందులకు చెందిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయ అర్చకులు దేశాయి గోపాలకృష్ణమూర్తికి ఇటీవల కాళ్లు విరగడంతో కడపలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిగా ఉంటున్న ఆయన కుమారునికి ప్రాంకియాటిక్ సమస్య తలెత్తింది. ఆపరేషన్‌కు రూ. 2 లక్షలకు పైగా అవుతుందని, ఈ వైద్యానికి ఆరోగ్యశ్రీ వర్తించదన్నారు. ఈ విషయం తెలుసుకున్న విజయ్‌భట్టర్ తన సంఘ ప్రతినిధులతో కలిసి గురువారం పులివెందులకు వెళ్లి రూ. 25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిధులు తివిక్రమ్ భట్టర్, వీణా మనోజ్‌కుమార్, ఇంద్రకంటి ప్రభాకర్‌శర్మ, మధుర భారతం సు. దీర్‌శర్మ, సిద్ధవటం రవి, వరప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం శ్రేయస్కరం



కడప ఎడ్యుకేషన్ : సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్



కడప అర్బన్ : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్న కడప ట్రాఫిక్ సీఐ వి. సీతారామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ద్విచక్ర వాహనాలను నడిపేవారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుడు తన ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని కూడా గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఖచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. విద్యార్థులు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని తెలుసుకుని ఖచ్చితంగా హెల్మెట్‌ను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ షకీల బేగం, గోవింద రెడ్డి, కళాశాల అధ్యాపకులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాహనదారులు హెల్మెట్ ధరించి తమ గమ్య స్థానాలకు సురక్షితంగా చేరాలని కడప రైల్వే స్టేషన్ మాస్టర్ శేఖర్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కడప రైల్వేస్టేషన్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కోసం, మీ కుటుంబం కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఐఎస్ఐ మార్కుగల నాణ్యమైన హెల్మెట్‌లను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సిబ్బంది, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసుల నమోదు

కడప అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తామని కడప ట్రాఫిక్ సీఐ వి.సీతారామరెడ్డి తెలియజేశారు. కొన్ని రోజులుగా నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందిపై కేసులను నమోదు చేసి ఆ వ్యక్తులను గురువారం కోర్టులో హాజరుపరిచామన్నారు. విచారించిన న్యాయమూర్తి నిందితులకు జరిమానా విధించి మందలించారన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలను తీసుకుంటామనీ సీఐ హెచ్చరించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. గురువారం సాయంత్రం కడప నగరంలోని వై-జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పెట్టుకోవాలని అవగాహన కల్పించారు.

ఆటో పార్కింగ్ ఏరియాను శుభ్రంగా ఉంచుకోవాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని చెమ్ముమియ్యాపేటలో భగత్ సింగ్ పార్కు పక్కనున్న క్లాప్ ఆటో పార్కింగ్ ఏరియాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం 50, 48 డివిజన్లలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్లాప్ ఆటో సమయానికి నిర్దేశించిన వార్డుకు చేరుకొని చెత్త సేకరణ ప్రారంభించాలన్నారు. ప్రతి క్లాప్ ఆటోకు ఎలక్ట్రానిక్ వేస్ట్, బయో మెడికల్ వేస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈట్ స్ట్రీట్ చుట్టూ గ్రీనరీ పెంపొందించాలని, డ్యామేజ్ అయిన పోలార్డ్స్, లైట్లు తక్షణం మరమ్మతులు చేయించాలన్నారు. పాలెంపల్లె వద్దనున్న గార్బేజ్ పాయింట్లు వెంటనే తొలగించాలన్నారు. గ్యాంగ్ వర్క్ చేపట్టి పిచ్చి మొక్కలు తొలగించాలని, కాలువల్లో పూడిక తీయించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వీధిలో కాలువ మట్టితో నిండిపోవడం చూసి వెంటనే మట్టిని తొలగించాలని ఆదేశించారు. 48వ డివిజన్‌లో బుడగజంగాల కాలనీలో ప్రతి డ్రైనేజీ కాలువను శుభ్రం చేయాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలన్నారు. సచివాలయ కార్యదర్శులు యూనిఫారం, ఐడీ కార్డు, క్లీన్ కడప లోగో ధరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్ / కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య (పీఎస్‌వైఎఫ్) రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేశు కోరారు. గురువారం కలెక్టర్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎస్సీ హాస్టళ్లలో 11 నెలలుగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బీసీ వెల్ఫేర్ హాస్టళ్లలో ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించలేదన్నారు. మైనార్టీ, ఎస్టీ బిల్లులదీ కూడా ఇదే పరిస్థితి అన్నారు. ఇందువల్ల వార్డెన్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రొద్దుటూరులో బాలికల హాస్టల్ ప్రైవేటు భవనంలో నడుస్తోందని, ఒక హాస్టల్ గది కృంగి పడిపోయిందన్నారు. బద్వేలులో హాస్టల్ బిల్డింగ్ పెచ్చులూడుతోందన్నారు. హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బయన్న పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో కోలాటాలకు ప్రత్యేక స్థానం

కడప సెవెన్‌రోడ్స్ : భారతీయ సంస్కృతిలో జానపదాలు, కోలాటాలకు ప్రత్యేక స్థానం ఉందని కలెక్టర్ శివశంకర్ అన్నారు. అంతర్జాతీయ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కిన ప్రొద్దుటూరుకు చెందిన సావిత్రిబాయి పూలే అభ్యుదయ పోరాట బృందం గురువారం కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ వండర్స్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించడం అభినందనీయమన్నారు. జానపదాలు, కోలాటాలు కనుమరుగవుతున్న సమయంలో జిల్లాకు చెందిన వారు అంతర్జాతీయ గుర్తింపు సాధించడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ప్రొద్దుటూరుకు చెందిన మల్లిక ఆధ్వర్యంలో ఓం నమో వెంకటేశాయ ద్వారక తిరుమల దేవస్థానంలో మహిళా కోలాట బృందం 222 మందితో దశావతారాల నృత్యాన్ని ప్రదర్శించడంతో అంతర్జాతీయ గుర్తింపు లభించిందని బృందం సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు మల్లిక, పార్వతి, రమాదేవి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మొదట వచ్చిన ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట వచ్చిన చిన్న ఉద్యోగమైనా చేరి భవిష్యత్తులో అంచెలంచెలుగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అల్‌డిక్సన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రి విజన్, కాంపోజిట్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు వచ్చాయని, వీటిలో ఏ ఉద్యోగమైనా చేరాలన్నారు. జాబ్‌మేళాకు 125 మంది హాజరు కాగా, వారిలో అర్హత, అనుభవాన్ని బట్టి 41 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వినోద్, అమర్, ధాత్రి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. గురువారం కడప నగర శివార్లలోని ఆలంఖాన్‌పల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వం ప్రకటించిన అకడమిక్ క్యాలెండర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. దీంతోపాటు భోజన నాణ్యతను ఉపాధ్యాయులు ప్రతి రోజు పరిశీలించాలన్నారు.

ఘనంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : 73వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం కడప జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జోనల్ కార్యదర్శి ఎం.రాజశేఖర్, రీజినల్ కార్యదర్శి ఏఆర్ మూర్తి, కోశాధికారి ఆర్‌బీఎస్ మణ్యం పాల్గొన్నారు. కడప డిపో అధ్యక్షులు రాము ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి ఏఎస్ రెడ్డి, గ్యారేజ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ నాయకుల ఆధ్వర్యంలో..

ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గంగాంజనేయులు కోరారు. ఆర్టీసీ కాంట్రాక్టర్ ద్వారా 7300 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఆప్కాస్‌లో ఆర్టీసీని కలపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రామాంజనేయులు, రీజినల్ సెక్రటరీ అంకిరెడ్డి, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయ్, వర్కింగ్ సెక్రటరీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

పచ్చిగడ్డి వాడకంతోనే పశువులకు ఆరోగ్యం

ముద్దనూరు : పచ్చిగడ్డి వాడకంతో పశువులకు మంచి ఆరోగ్యమేకాకుండా అధిక పాల ఉత్పత్తి జరుగుతుందని పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా కొత్తపల్లె గ్రామంలో పచ్చిగడ్డి వాడకంతో పశువుల్లో కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. జొన్న, మొక్క జొన్న, సజ్జ, పిల్లిపెసర, అలసందలతో పాటు సూపర్ నేపియర్, పారాగ్రాస్, గినీ గ్రాస్, లూస్నర్ వంటి పచ్చిగడ్డి వాడకాలతో పాల ఉత్పత్తి, పాలల్లో వెన్నశాతం పెరుగుదల, పాడి రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతరం తిమ్మాపురం గ్రామంలో గొర్రెలకు నీలినాలుక(బ్లూటంగ్) టీకాలను అందజేశారు. గొర్రెల, మేకల యజమానులు వారి జీవాలకు నోటిపుండ్లు, జ్వరము రాకుండా ఈ టీకాలు వేయించాలని ఆయన కోరారు.



పచ్చిగడ్డి వాడకంపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

సమస్యలను పరిష్కరించండి

ఎర్రగుంట్ల : మండలంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో సభాభవనంలో గురువారం నిర్వహించిన మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సమావేశం ఉపమండలాధ్యక్షుడు మల్లు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చిలంకూరు ఎంపీటీసీ సభ్యులు కొండయ్య మాట్లాడుతూ చిలంకూరు గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలన్నారు. అనంతరం వై.కోడూరు గ్రామ సర్పంచ్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సరిహద్దుల్లో బ్లాక్ ఫౌడర్ డంపింగ్ చేస్తున్నారని దానికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి లేదన్నారు. అలాగే ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో ఉందని, దీని అవతలి వైపున రైతుల పొలాలు ఉన్నాయని వాటికి వెళ్లడానికి దారి కల్పించాలన్నారు. దీనిపై మండల ప్రత్యేకాధికారి శాంతి మాట్లాడుతూ బ్లాక్‌ఫౌడర్‌పై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి దాని లేకుండా చేయాలని సమావేశంలో సూచించారు. మండల స్థాయి అధికారులు వారి శాఖకు సంబంధించిన స్కీంల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జాషువ, తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శాంతి

బొప్పాయి తోటను పరిశీలించిన శాస్త్ర వేత్తలు

కొండాపురం : మండల పరిధిలోని గండ్లూరు రెవెన్యూ పొలంలో పీవీ నరసింహారెడ్డి బొప్పాయి తోటను గురువారం పులివెందుల ఉద్యాన పరిశోధక శాస్త్రవేత్తలు సుశీల, సునీల్‌కుమార్‌లు పరిశీలించారు. బొప్పాయి పంటను సాగు చేసి ఏడునెలలు గడిచిన దిగుబడి రాకపోవడంతో రైతు జిల్లా ఉద్యానశాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. దీంతో జిల్లా అధికారి తాడేపల్లిలోని ఉద్యాన పరిశోధన కేంద్రంకు సమాచారం ఇవ్వడంతో పులివెందుల ఉద్యాన పరిశోధక శాస్త్రవేత్తలు బొప్పాయి తోటను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పలు నమూనాలు సేకరించి వాటి ఫలితాల అనంతరం దిగుబడి ఎందుకు రాలేదనేది తెలుపుతామన్నారు. కార్యక్రమంలో జైయిన్ సంస్థ ప్రతినిధి హనుమంత్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి రామాంజల్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మధుమల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఈయూ లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు బోసుబాబు పేర్కొన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయం వద్ద ఈయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1953 జూలై 11న ఆవిర్భవించిన ఎంప్లాయిస్ యూనియన్ నాటి నుండిచి నేటి వరకు కార్మికుల పక్షాన నిలబడి ఎన్నో రాజీలేని పోరాటాలు కొనసాగించి విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ శాశ్వత గౌరవాధ్యక్షులు ఐ.ఎం.రావు, డిపో కార్యదర్శి బి.పి.నరసింహులు, గ్యారేజీ సెక్రటరీ రాజశేఖర్, యూనియన్ నాయకులు గంగయ్య, సి.ఎస్.రెడ్డి, మాధవరెడ్డి, పెంచలయ్య, జి.ఎస్.వాసులు, పెద్ద ఎత్తున ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఈయూ జిల్లా అధ్యక్షుడు బోసుబాబు, నాయకులు

సహజవాయువు నిక్షేపాల కోసం సర్వే

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం, ఏరువపాళెం గ్రామాల్లోని పొలాల్లో గురువారం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆయిల్ న్యాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సర్వే చేస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వాహనం, రిగ్గు సహాయంతో బోర్లు వేసి ప్రత్యేక సేన్సార్ల ద్వారా ముమ్మర సర్వే చేస్తున్నారు. గతేడాది వేసవి కాలంలో మండలంలోని వెల్లాల కేంద్రంగా త్రీ డీ సర్వే నిర్వహించారు. ఈ సర్వే రిపోర్టులను డెహ్రాడూన్‌కు పంపించిన తర్వాత అక్కడి నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో సహజ వాయువుల నిక్షేపాలపై పూర్తి సమాచారం తెలుస్తున్నట్లు ఓఎన్‌జీసీ సంస్థ బృందం తెలిపింది.



రాజుపాళెం పొలాల్లో సహజ వాయువుల కోసం బోర్లు వేస్తున్న దృశ్యం

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆర్‌ఎంకు ఎన్‌యూ నాయకుల వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రీజియన్ పరిధిలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, సుధాకర్‌లు కోరారు. గురువారం డీపీటీఓ పొలిమేర గోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు నెలలుగా కడప డిపోలో నైట్ అవుట్ అలవెన్సులు కలపడం లేదన్నారు. రాష్ట్రంలో జోన్లు, రీజియన్లలో ఎక్కడా లేని విధంగా కడప డిపోలో కండక్టర్ల చార్టు అమలు చేసి, డ్రైవర్ల చార్టు అమలు చేయకపోవడం సరికాదన్నారు. సర్క్యులర్ నిబంధనల ప్రకారం లిటరసీ టెస్ట్ పెట్టి వారికి ఏఏఎస్ ఇంక్రిమెంట్లు కలిసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చదువు లేని గ్యారేజీ సిబ్బందికి ఏఏఎస్ ఇంక్రిమెంట్లను కలపాలన్నారు. ఇంకా పలు సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీ కార్యదర్శులు, రీజినల్ కమిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్‌యూ నాయకులు

జనాభా నియంత్రణ చాలా అవసరం



జమ్మలమడుగులో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



వేంపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు, తదితరులు

జమ్మలమడుగు : జనాభాను నియంత్రణ చేయడం చాలాముఖ్యమని డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆమె పట్టణంలో ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. దేశంలో జనాభా వేగంగా పెరిగిపోతోందని ఒకరు ముద్దు రెండు హద్దు అంటూ ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు తాహీర్, ఖాదర్‌బాషా, సీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

వేంపల్లె : తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వాతిసాయి ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో నినాదాలు చేయిస్తూ ఆమె ర్యాలీ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచం మొత్తం 800 కోట్ల జనాభా ఉందని, భారతదేశం 144 కోట్ల మంది జనాభా కలిగి ఉన్నట్లు తెలిపారు. జనాభా ఎక్కువయ్యే కొద్ది తినేందుకు ఆహార కొరత, రోగాలు అధికమవుతాయన్నారు. అలాగే హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులు, యువతిని అభివృద్ధి వైపు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. సీహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అరీఫుల్లా మాట్లాడుతూ అధిక జనాభా అభివృద్ధికి ఆటంకమని, చిన్న కుటుంబం ద్వారానే ఆరోగ్యం, విద్య, ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. పరిమిత కుటుంబం పాటించడం ఉత్తమమన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్న కుటుంబం-చింతలేని కుటుంబం, కుటుంబ సంక్షేమం- దేశ సౌభాగ్యం, బాల్య వివాహాలు వద్దు-సరైన వయసులో వివాహం ముద్దులాంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ పోస్టర్లు విడుదల



గిరి ప్రదక్షిణ కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : ఈనెల 21వ తేదిన పౌర్ణమిని పురస్కరించుకుని పుష్పగిరి పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను గురువారం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విడుదల చేశారు. పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి నిర్వాహకులు సట్టి భారవి, డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాస్, మరో 12 సంస్థలతో కలిసి నిర్వహించనున్న ఈ యాత్రకు సంబంధించిన కార్యక్రమాలు వివరించారు. 21న నగరంలోని అన్నమాచార్యుల విగ్రహం వద్ద మధ్యాహ్నం 3 గంటల నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి తాళ్లపాక అన్నమయ్య వారసులైన సద్గురు తాళ్లపాక స్వామి దంపతులు హాజరవుతారన్నారు. వారు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని తెలిపారు.